క్లుప్తంగా

సామూహిక సత్యసాయి వ్రతాలు



దేవరపల్లిలోని సాయిమందిరంలో సత్యసాయి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

దేవరపల్లి: దేవరపల్లిలోని షిర్డీసాయి మందిర వార్షికోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం సాయినాథ హోమం, సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులు సాయినాథుడిని దర్శించుకున్నారు. ఫిబ్రవరి 1న లక్ష్మీనారాయణ శాంతి కల్యాణం, అన్నసమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ టోర్నీకి గాయత్రి ఎంపిక



రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీలకు ఎంపికైన గాయత్రిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దేవరపల్లి: కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఇటీవల నిర్వహించిన అండర్ 19 మహిళా క్రికెట్ అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో దేవరపల్లి మండలం గౌరీపట్నం సెయింట్ మేరీస్ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని కొడవటి గాయత్రి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ స్వప్న తెలిపారు. సోమవారం కళాశాల వద్ద గాయత్రిని ప్రిన్సిపాల్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా, అధ్యాపకులు అభినందించారు.

నేడు త్యాజంపూడిలో 'గడప గడపకు'

దేవరపల్లి: దేవరపల్లి మండలం త్యాజంపూడిలో మంగళవారం ఉదయం 9 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి వీర వెంకటసతీష్ తెలిపారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు హాజరుకావాలని ఆయన తెలిపారు.

యథేచ్ఛగా కాలువ గట్టుపై చెట్ల నరికివేత

గోపాలపురం: గోపాలపురం మండలం రాజంపాలెం, సాగిపాడు గ్రామాల మధ్య ఉన్న కొవ్వాడ రిజర్వాయర్ కాలువ గట్టుపై ఉన్న చెట్లను అక్రమార్కులు యథేచ్ఛగా నరికి తరలిస్తున్నారు. సోమవారం ఇరిగేషన్ అధికారులు కాలువ గట్టును ఏఈ సీహెచ్ భాస్కరరావు పరిశీలించారు. ఏఈ భాస్కరరావు మాట్లాడుతూ గతంలో ఇదే కాలువ గట్టుపై చెట్లను నరికిన దళారులు, రైతులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. రాజంపాలెం, సాగిపాడు గ్రామాల్లో చెట్లను నరికి కలపను పొగాకు క్యూరింగ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. దీనిపై ఇరిగేషన్ ఈడీ కె రవీంద్రబాబు మాట్లాడుతూ గతంలో కాలువ గట్టుపై చెట్లను నరికి, కలప విక్రయించిన దళారులు, రైతులను గుర్తించినట్లు చెప్పారు. సర్వే నిర్వహించి అక్రమార్కులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని డీఈ చెప్పారు.

మేళతాళాలతో పోలమ్మ తల్లి గ్రామోత్సవం



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నల్లజర్ల: అనంతపల్లిలో రజకుల ఆరాధ్యదైవం పోలమ్మ తల్లి ఆలయ 40వ వార్షిక ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. సోమవారం అమ్మవారిని ప్రత్యేక వాహనంపై అలంకరించి మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, బాణసంచాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి మహిళలు హారతులిచ్చారు. గ్రామంలోని ఉండ్రాళ్ల చెరువు గట్టున అమ్మవారికి ప్రత్యేక ఆలయం ఏర్పాటు చేసి ఏటా జనవరి నెలాఖరున ఉత్సవాలు నిర్వహిస్తామని సంఘ పెద్ద తొంటపాక సూర్యారావు, యూత్ నాయకుడు ఏలూరు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పిస్తారు.

ప్రక్కిలంకలో సౌరయాగం

తాళ్లపూడి: లోక కల్యాణార్థం శశిశేఖర మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రక్కిలంక శివాలయం వద్ద నిర్వహిస్తున్న 14వ సౌరయాగం పూజలు సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు కొతవరపు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి గోపూజ, సౌరజపం, సూర్యనమస్కారాలు, సౌరహోమం, అరుణాపారాయణం, సూర్యనారాయణమూర్తికి అభిషేకాలు చేశారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్ల అభివృద్ధికి నిధుల కేటాయింపు

- మున్సిపల్ అజెండాలో 21 అంశాలు ఏకగ్రీవ ఆమోదం
- రూ.52 లక్షలతో రోడ్లకు మరమ్మతులు
- మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ



హాజరైన సభ్యులు



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు : పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అజెండాలో ఉన్న 22 అంశాల్లో 18వ అంశమైన ప్లాస్టిక్ నియంత్రణపై నిషేధం అంశాన్ని వాయిదా వేయగా మిగిలిన 21 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణంలో మౌలిక సదుపాయల కల్పనే ధ్యేయంగా వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు 15వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ నిధులు రూ.1.80 కోట్లు కేటాయించామన్నారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ. 52 లక్షల వ్యయంతో పట్టణంలో గుర్తించిన సీసీ, బీటీ రోడ్లకు మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి మాట్లాడుతూ ప్లాస్టిక్, ఫ్లెక్సీల తయారీపై హైకోర్టు స్టే విధించడాన్ని పరిగణలోకి తీసుకుని ప్లాస్టిక్ నిషేధం అనే 18 అంశాన్ని తాత్కాలింగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. వివిధ వార్డుల్లో పలు అభివృద్ధి పనుల కోసం తీసుకువచ్చిన అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మీ, యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, టీపీఎస్ కున్యం సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సులు



దేవరపల్లిలో బీజేపీ మండల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు

దేవరపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శక్తి కేంద్రాల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం. దత్తు తెలిపారు. దేవరపల్లిలోని ఉమారామలింగేశ్వర కల్యాణ మండపంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సుమన్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయిస్తున్న నిధులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జిగా కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్‌ను నియమించారని ఆయన చెప్పారు. పార్లమెంట్ పరిధిలో ఫిబ్రవరి 4,5 తేదీల్లో శక్తి కేంద్రాల సమావేశాలు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ర్యాలింగి శ్రీదేవి, రాష్ట్ర ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలేపు సత్యసాయి, రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షుడు కాట్రగడ్డ రవీంద్ర, జిల్లా నాయకులు పక్కి నాగేంద్ర, కందికొండ రమేష్, శెట్టి శివనాగప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లిలో అగ్నిమాపదక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం. దత్తు, నాయకులు తహసీల్దార్ ఎం. రామకృష్ణకు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ప్రతి మండలంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ప్రధాన సమస్యలపై వినతిపత్రం అందజేయనున్నట్టు ఆయన చెప్పారు.

బీజేపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలి

ద్వారకాతిరుమల: బీజేపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బొమ్మలు దత్తు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీవారి కృప కల్యాణ మండపంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎంఎస్‌వీ గణపతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పీక్కి నాగేంద్ర, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కాలేపు సత్యసాయిరాం, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి శివనాగరాజు పాల్గొన్నారు.

మార్చి 23న ఎన్‌ఎల్‌ఎస్ పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్‌లోని వేలం కేంద్రాల్లో రెండు దఫాలుగా పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. గుంటూరు పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో సోమవారం పొగాకు వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులు, గ్రేడర్లతో నిర్వహించిన సమావేశంలో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు పొగాకు కొనుగోళ్లపై చర్చించారు. పొగాకు క్యూరింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నందున ఫిబ్రవరి 23న సౌత్‌లో, మార్చి 23న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాని ఎన్‌ఎల్‌ఎస్ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించేందుకు నిర్ణయించినట్టు దేవరపల్లి వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు వేలం కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కోరినట్టు శ్రీధర్‌బాబు చెప్పారు. పొగాకు విక్రయించిన రైతులకు కొనుగోలుదారులు బ్యాంకు ద్వారా త్వరితగతిన సొమ్ము చెల్లించాలని రైతు సంఘాల ప్రతినిధులు ఈడీ శ్రీధర్‌బాబును కోరామన్నారు. ఎనిమిది రోజులకు సొమ్ము చెల్లించేందుకు ఆయన అంగీకరించినట్టు తెలిపారు. గతేడాది మార్చి 24న పొగాకు కొనుగోళ్లు ప్రారంభించగా ఈ ఏడాది ఒక రోజు ముందు ప్రారంభిస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఎన్‌ఎల్‌ఎస్ పొగాకుకు మంచి డిమాండ్ ఉందని, ఎగుమతి ఆర్డర్లు ఎక్కువగా ఉండడం వల్ల ఈ ఏడాది మార్కెట్ ఆశాజనకంగా ఉంటుందని అధికారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరులో నిర్వహించిన సమావేశంలో బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల రైతు సంఘాల అధ్యక్షుడు సత్రం వెంకట్రావు, పరిమి రాంబాబు, కాకర్ల నంది, పిన్నమనేని మధు, రైతులు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు శిరిగిన సత్తిరాజు మృతి

ఉండ్రాజవరం: వేలివెన్ను సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శిరిగిన సత్తిరాజు (87) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వేలివెన్ను సొసైటీ అధ్యక్షుడిగా 18 సంవత్సరాలు పనిచేశారు. సొసైటీ భవనం, గోడౌన్, ఉన్నత పాఠశాల నిర్మాణానికి కృషి చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె కలరు. సోమవారం ఉదయం జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, సొసైటీ అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణబ్రహ్మానందం, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు శిరిగిన శివరాధాకృష్ణ తదితరులు సత్తిరాజు పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

కొవ్వూరు: ఫిబ్రవరి 1న నిడదవోలులో నిర్వహించే ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఎంసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం కోరారు. సోమవారం కొవ్వూరులో జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కొవ్వూరు ఏరియా కమిటీ ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి శివ,జిల్లా నాయకులు కేవీ రమణ, యు.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత
- నెలటూరులో గడపగడపకు మన ప్రభుత్వం



నెలటూరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. నెలటూరులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు మంత్రి వనిత వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ఎంపీటీసీ తాళ్లూరి రమ్య, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు గేడా శ్యామ్, తాళ్లూరి దామోదరం, కరుటూరి శ్రీను, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అభినందనీయం

కొవ్వూరు: ఆర్డీవో కారు డ్రైవర్ మండెల శ్రీనివాసరావు ఆధ్మాతిక చింతనతో 18 సార్లు శబరిమలై యాత్ర వెళ్లడం, ఆరు పదుల వయస్సు సమీపించిన తరుణంలోనూ ఐదుసార్లు సైకిల్‌పై యాత్రకు వెళ్లడం అభినందనీయమని ఆర్డీవో ఎస్.మల్లిబాబు పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మల్లిబాబు, కార్యాలయ ఉద్యోగులు శ్రీనివాసరావును సత్కరించారు.

గాంధీజీ త్యాగాలు మరువలేనివి

గోపాలపురం: జాతిపిత మహాత్మా గాంధీ త్యాగాలు మరువలేనివని గోపాలపురం ఎంపీడీఓ ఆర్ శ్రీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాంధీ శాంతి మార్గం ఆదర్శనీయం

పెరవలి: గాంధీ చూపిన శాంతి మార్గంలో అందరూ పయనించాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తెలిపారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, ఈఓపీఆర్డీ నర్సింహమూర్తి వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి నాగేశ్వరరావు, పంపన అంజి, కరుటూరి విశ్వనాథం పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో

ఉండ్రాజవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కుష్టు నిర్మూలన(స్పర్శ) కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అవార్డులు అందుకున్న ఎంపీడీఓ ఏ.శ్రీనివాసు, సీహెచ్‌ఓ మైలవరపు సుబ్రహ్మణ్యంలను ఘనంగా సత్కరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, వైస్ ఎంపీపీ ఎన్.సరోజ, సర్పంచ్ మెండే వెంకట్రావు పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళి

కొవ్వూరు: జాతిపిత మహ్మాత్మా గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలో మొయిన్‌రోడ్డు, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉన్న ఆయన విగ్రహాలకు సోమవారం ఆర్యవైశ్య సంఘ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, కార్యదర్శి నాళం వీరవెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడవాలి

నిడదవోలు రూరల్: మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపీడీఓ టి.మూర్తిబాబు అన్నారు. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సోమవారం పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఏఓ రత్నరాజు పాల్గొన్నారు.

జాతిపిత ఆశయాలను ఆచరించాలి

చాగల్లు: జాతిపిత గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని, ప్రతి ఒక్కరూ ఆచరించాలని సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. చాగల్లు మండలం మల్లవరంలో ఆనందనికేతన్ సేవా కేంద్రంలో గాంధీజీ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కవి సమ్మేళనం నిర్వహించి, కవులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆశ్రమం ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, కోడూరి కాశి, కస్తూరిబా మహిళా సమాజం నిర్వాహకులు, గాంధేయవాదులు పాల్గొన్నారు.

వట్టి వసంతకుమార్ మృతి తీరనిలోటు

నిడదవోలు రూరల్: రాజకీయాల్లో నిజాయతీగా పనిచేసి అభివృద్ధికి కృషి చేసిన మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మృతి తీరనిలోటని కాపు సంఘం జిల్లా నాయకులు, శంకరాపురం సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు సోమవారం అన్నారు. నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి మంత్రిగా వట్టి వసంతకుమార్ ఎంతో సహకరించారని రామారావు గుర్తు చేసుకున్నారు. వసంతకుమార్ ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిన్నారులకు తులాభారం

పెరవలి: నల్లాకులవారిపాలెంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఏకాహ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల తులాభారంలో 1,850 కిలోలు పటిక బెల్లం ఆలయానికి వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.

జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

నల్లజర్ల: జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్గిండాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ జాన్ మోసెస్ వెస్లీ సూచించారు. జంతు సంరక్షణ వారోత్సవాల సందర్భంగా సోమవారం నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ సహాయకులు కండెల్లి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు లాల్‌నెహ్రూ పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 51 వేల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ. 51 వేలను విరాళంగా అందజేశారు. ఉంగుటూరు మండలం సీతారాంపురంకు చెందిన గేదెల పూర్ణారావు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

చురుగ్గా నిడదవోలు రైల్వేట్రాక్ మరమ్మతులు



నిడదవోలు రైల్వేగేటు వద్ద ట్రాక్ మరమ్మతులు



రైల్వేగేటు వద్ద చంటి బిడ్డతో ట్రాక్ దాటుతున్న మహిళ

- రైల్వేగేటు మూసివేత
- ఫిబ్రవరి 8న సాయంత్రం పునఃప్రారంభం

నిడదవోలు : అత్యవసర ట్రాక్ మరమ్మతుల కోసం పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్లోని ప్రధాన రైల్వేగేటును సోమవారం ఉదయం 7 గంటల నుంచి రైల్వే అధికారులు మూసివేశారు. రైల్వేశాఖ భద్రతా చర్యల్లో భాగంగా ట్రాక్ మరమ్మతులు చేపట్టారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనుల కోసం పది రోజుల పాటు రైల్వేగేటు మూసివేయనున్నారు. తిరిగి ఫిబ్రవరి 8న రైల్వే గేటును తిరిగి పునఃప్రారంభించనున్నారు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళుతున్నారు. ట్రాక్ దాటుకుంటూ ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు ట్రాక్ వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి ఏడు బస్ సర్వీసులను ప్రతి రోజు నిడదవోలు రైల్వేగేటు వరకు నడుపుతున్నారు. అదే విధంగా నిడదవోలు రైల్వేగేటు నుంచి రాజమండ్రి వెళ్లేందుకు నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి ప్రతి రోజు ఐదు సర్వీసులు నడుపుతున్నారు. నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి ఏలూరు, విజయవాడ ప్రాంతాలకు ఉండ్రాజవరం, తణుకు మీదుగా నాలుగు బస్ సర్వీసులు ఏర్పాటు చేశారు.

రుణాలు సక్రమంగా చెల్లిస్తే ఆర్థిక పరపతి లభ్యం



సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి

కొవ్వూరు: డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగపర్చుకోవడంతో పాటు సకాలంలో క్రమం తప్పకుండా తిరిగి చెల్లించడం ద్వారా ఆర్థిక పరపతిని పెంచుకోవచ్చని మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి సూచించారు. పట్టణంలో మునిసిపల్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం పట్టణ మహిళా సమాఖ్య వార్షిక మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులను సక్రమం నడిపించడంపై రిసోర్స్‌పర్సన్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. బ్యాంకుల నుంచి పొందిన రుణాలను మహిళలు ఆర్థిక పురోగాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. పట్టణ సమాఖ్యలో 12 సమాఖ్యలకు అంతర్గత అప్పులు రూ.11.50 లక్షలు అందించామని, రూ.7,94,250 సమాఖ్యల నిల్వ, రూ.4.17లక్షలు బ్యాంకు నిల్వ ఉన్నట్లు పట్టణ సమాఖ్య సభ్యులు నివేదిక చదివి వినిపించారు. నూతన పట్టణ సమాఖ్య అధ్యక్షురాలిగా మందపాటి రత్న, సెక్రటరీ ఎస్‌కే పద్మ, కోశాధికారిగా పెరుమాళ్ల అంబిక, ఉపాధ్యక్షురాలిగా సాధ మౌనిక, జాయింట్ సెక్రటరీగా కోమలి విజయలక్ష్మిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు అంకోలు వెంకట లీల్లి పద్మలీల, పతివాడ నాగమణి, సీఎంఎం ఎ.జ్యోతి, మెప్మా ఐబీ కె.మోహన్, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

నరసన్న కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు



గర్భాలయంలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహుడు



ప్రత్యేకంగా నిర్మించిన తాత్కాలిక క్యూలైన్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుమనోహర సుందరగిరి పర్వతంపై కొలువైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. భీష్మ ఏకాదశి పర్వదినం మొదలుగా ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. షామియానా, చలువ పందిర్లు, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల నిర్మాణాలు, విద్యుద్దీప అలంకరణ పనులు పూర్తయ్యాయి. ఏకాదశి వంటి పర్వదినాల్లో వేలాదిగా భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. చినవెంకన్న దేవస్థానం ఏటా స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తోంది. ఇటీవల దాతల సహకారంతో ఈ ఆలయాన్ని రూ. 3 కోట్లతో అభివృద్ధి చేశారు. ఫిబ్రవరి 1న ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరిస్తారు. నిత్య హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 3న ఉదయం 11.10 గంటల నుంచి స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, 4న సాయంత్రం 6 గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 5న ఉదయం స్వామి, అమ్మవార్లకు చందనోత్సవం, సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణ జరుగుతుంది.6న రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణ, శ్రీపుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



నారసింహుని దివ్య కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకల్లో పాల్గొనే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. కొండ కింద కల్యాణ మండపంలో వచ్చేనెల 3న స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– వేండ్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

'స్పందన'కు ఎనిమిది అర్జీలు

కొవ్వూరు: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎనిమిది అర్జీలు అందాయని ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. వీటిలో ప్రధానంగా కొవ్వూరు సామాజిక ఆసుపత్రిలో ఉన్న మార్చురీ కారణంగా గౌతమీ నగర్ వాసులు వివిధ రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ కోరారు. వేములూరులో పశివేదలకు చెందిన కరుటూరి కృష్ణవేణి అనుమతుల్లేకుండా చేపల చెరువులు తవ్వినందున చర్యలు తీసుకోవాలని మందగండి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. గోపాలపురానికి చెందిన నడవపల్లి సూరిబాబు తన భూమికి రెడ్‌మార్క్‌లో ఉన్న చుక్కల భూమి నుంచి తొలగించాలని కోరారు.

చివటంలో ఘనంగా బల్లల పండగ

ఉండ్రాజవరం: మండలంలో చివటం గ్రామంలో రజకుల కులదేవత ఈదమ్మ బల్లల పండగ సోమవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి రోజు మేళతాళాలు, కోయ డ్యాన్సులతో అమ్మవారిని పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. మంగళవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పిస్తారు. చివటం లక్ష్మీ గణపతి రజక సంఘం అధ్యక్షుడు రాజ మండ్రి సత్యనారాయణ, రజక సంఘం ఉపాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, సెక్రటరీ ఆర్.గోపాలకృష్ణ, కోశాధికారి ఇల్లింద్రపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

చాగల్లు: మార్కొండపాడులో సొసైటీ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటివైద్య శిబిరాన్ని సొసైటీ అధ్యక్షుడు లకంసాని రామకృష్ణ ప్రారంభించారు. ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వైద్యులు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.